
# సౌభాగ్యానికి సోపానాలు

– సత్యవాడ సోదరీమణులు



వాసంతి రెండు రోజులు పుట్టింటికి వెళ్ళి వచ్చేసరికి, ఆమెను ఆశ్చర్య పరచే సంఘటన జరిగింది. అదే మరొకరికైతే అద్భుతంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించకపోయేదేమో. తను వెళ్ళేసరికి తాళం వేసి వెల వెలబోతున్న ప్రక్క వాటా ఇప్పుడు నిండుగా కలకలలాడిపోతోంది. పద్మావతి వెళ్ళిపోయాక ఆ ఇంట్లోకి ఎందరెందరో రావటం అంటూ వచ్చారు కానీ, పద్మావతిలా తనకు సన్నిహితం కాలేదు. నెల రోజుల నుంచి అస్సలు మనుషులంటూ లేరు. ఆ వాటా ఖాళీగా వుండటం తనకు ఏదో వెలితిగా తోచేది. పరిచయం లేక పోయినా ప్రక్కవాటాలో సందడి ఏదో కాల క్షేపంగా అనిపించేది. అయినా ఎవరితో మాత్రం తనకు పరిచయం పెంచుకొనే తీరుబడి ఎక్కడ! అయినా ప్రక్కింట్లోకి మనుష్యులు రావటం సంతోషంగా అనిపించింది.

వాసంతి వంట పూర్తి చేసుకొని కొత్తగా వచ్చిన ఆమెను పలకరించాలని వెళ్ళింది. జయంతి ఆహ్వానం ఎంతో స్నేహ పూరితంగా అనిపించింది. నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడే ఆమె తీరు వాసంతిని ఇట్టే ఆకట్టుకుంది. కాస్సేపటిలోనే, ఆమె ఎం.ఎ., చదివిందనీ, రచయిత్రి అనీ తెలుసుకొని మరీ సంతోషించింది వాసంతి. "ఇక వెళ్ళొస్తానండీ" అంటూ లేచింది. "రేపు కాస్త తీరుబడిగా రండి. హాయిగా మాట్లాడుకోవచ్చు." జయంతి మాటలలో ఆమె స్నేహ హృదయం అర్థమయింది వాసంతికి. "నాకంత తీరికెక్కడిదీ! రోజూ ఆదరాబాదరా వంట చేసుకొని, పాపాయిని పనిపిల్లకు అప్పగించి ఆఫీసుకు వెళ్ళేసరికే ఎంతోకాలం కరిగిపోయేట్టు అనిపిస్తుంది. సాయింత్రం ఇంటికి వచ్చేక సరేసరి రోజు ఎలా గడుస్తుందో ఇక చెప్పలేను. మనం హాయిగా కబుర్ల కాలక్షేపం చెయ్యాలంటే ఆదివారం కోసమో, ఏ శలవు రోజు కోసమో ఎదురు చూడవలసిందే."

వాసంతి వెళ్ళిపోయింది. వాళ్ళ మధ్య పరిచయం స్నేహంగా మారుతూ వచ్చింది. ఒకరిని గురించి మరొకరు ఆలోచిస్తూ వుండేవారు. అసలు జయంతి ఉద్యోగం చేస్తే ఏం! ఆమెకు అన్ని అర్హతలూ వున్నాయి కదా అని వాసంతి ఆలోచిస్తే; వాసంతి ఎందుకంత ప్రయాసపడాలి? ఉద్యోగం చేయవలసిన అవసరం తనకేముంది? నిజానికి వాసంతి ఉద్యోగం చేయకపోతే ఆమెకు ఇంత శ్రమ వుండేదా! తన ఇంటి పని తనే చేసుకోవటంలోనూ, కన్నబిడ్డను కళ్ళల్లో పెట్టి పెంచుకోవటంలోనూ తనకెంతో తృప్తి లభించేదేమో,..... జయంతి మనసులో ఈ ఆలోచనలు. ఒకసారి వాసంతి తన మనసులో మాట జయంతిని అడిగేసింది. "మీరెందుకు ఉద్యోగం చేయకూడదు!" అని. జయంతికి నవ్వు వచ్చింది.

"చేస్తూనే వున్నానుగా; ఇంతకన్న మంచి ఉద్యోగం ఏముంది చెప్పండి" నవ్వుతూ అంది.

"నా మాట అలా తేలికగా తీసేయకండి. ఇంట్లో ఎంత శ్రమించినా విలువేముంటుంది? మనం ఉద్యోగం చేసి సంపాదిస్తే ఆర్థికంగా స్వాతంత్ర్యం వుంటుంది కదా." జయంతి మళ్ళా నవ్వి అంది... "ఆర్థికంగా స్వాతంత్ర్యము వుండాలంటే ఉద్యోగమే చేయాలా! అలా మీరంటే అందుకు నేనంగీకరించలేను. మనం పొదుపరితనం అలవర్చుకుంటే చాలు. చూడండీ..... ఇంటిపనులు చేసేందుకు పనివాళ్ళకోసం ఎంతో డబ్బు ఖర్చు చేస్తాం. అలాకాక, అంట్లు తోముకోవటం, బట్టలు ఉతికేసుకొని ఇస్త్రీ చేసుకోవటం ఇలాటి పనులు స్వయంగా చేసుకొంటే అది ఉద్యోగం కాదా?" ప్రశ్నార్థకంగా వాసంతి ముఖంలోకి చూసింది.

జయంతి మాటలకు కలిగిన చిరాకును, కోపాన్ని అణచిపెట్టే ప్రయత్నం చేస్తూ, "మీరు ఎంత చెప్పినా ఇది నాకు సబబుగా అనిపించటం లేదు. ఉద్యోగం చేయకపోతే మన చదువుకు సార్థకత ఎలా వస్తుంది? మగవాళ్ళు సంపాదిస్తూ వుంటే, వాళ్ళ సంపాదన మీద ఆధారపడి బ్రతకడం బానిసత్వం అనిపించుకోదూ?" వాసంతి తెలివి తక్కువ తనం జాలి కలిగించింది జయంతికి.

"మీరు పొరబడుతున్నారు. సంసార రథానికి భార్య భర్తలు చక్రాలవంటి వారు. సక్రమంగా సాగిపోవాలంటే ఎవరి విధి వారు నిర్వహిస్తే చాలు. ఇందులో ఒకరి అధికారము, మరొకరి బానిసత్వం ఏం వుంటుంది. భర్తల సంపాదన మీద ఆధారపడి బ్రతుకుతున్నామని భార్యలు అనుకుంటే, వాళ్ళు వంట చేసి పెడితే కాని ఏపూటా గడవదు, ఇల్లంటే ఆడవాళ్ళ రాజ్యం అని భర్తలు అనుకుంటే ఇక సంసారాలు ఎలా వుంటాయి చెప్పండి." జయంతి మాటలు శ్రద్ధగా వింటుంది వాసంతి. అది గమనించిన జయంతికి వాసంతిలో మార్పు తీసుకురావటం కష్టసాధ్యం కాదని అర్థమయింది. వాసంతి భుజం మీద ఆప్యాయంగా చేయివేసి "ఆలోచిస్తే, అన్నీ మీకే అవగాహన అవుతాయి" అంది.

రోజులు గడుస్తున్న కొద్దీ కాలప్రవాహంలో మరికొన్ని రోజులు గడిచిపోయాయి. వాసంతికి జీవితం మరీ యాంత్రికంగా అనిపించసాగింది. అప్పుడప్పుడు జయంతి భావాలే సరైనవేమో అనే ఊహ ఆమె మనసులో మెదల సాగింది.


ఓ రోజు వాసంతికి ఆఫీసులో పని ఎక్కువగా వుండటం వల్ల ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. వంట చేసుకోవటం ఈ పూట తనకి సాధ్యపడదేమో అనిపించింది. ఇంటికి రాగానే మంచం మీద వాలిపోయింది.

"వసూ! బాగా అలసిపోయినట్లున్నావ్. ఈ రోజు పని ఎక్కువగా వుందా?" భర్త ఆత్మీయంగా అడిగేసరికి వాసంతి అలసట సగం మాయమైంది. "అవునండీ, కాస్త పని ఎక్కువగానే వుంది, అయినా ఈ మధ్య ఆఫీసులోనూ, ఇంట్లోనూ పనిచేసుకోవటం కష్టమనిపిస్తోంది....." అంటూ లేచి కూర్చుంది.

"అవును వసూ! నేను చెప్తూనే వున్నాను. నువ్వు అనవసరంగా శ్రమిస్తున్నావని. నిజానికి నువ్వు ఉద్యోగం చేయవలసిన అవసరం ఏముందిచెప్పు," మదన్ వాసంతి ప్రక్కనే కూర్చుంటూ అన్నాడు.

"సరేగానీ పాపాయ్ ఏది!" ఆత్రంగా అడిగింది.

"అది నేను ఎంత సముదాయించినా నా దగ్గర వుండడలేదు. ఇప్పుడే జయంతిగారు వచ్చి తీసుకువెళ్ళేరు." వాసంతికి ఆమాటలు ఏదో వెగటుగా అనిపించాయి. తీసుకొచ్చేద్దామని జయంతి దగ్గరకు వెళ్ళింది. పాపాయిని ఒళ్ళో వేసుకొని ఆడిస్తోంది జయంతి. చిన్నారి, కళ్ళతోనే జయంతిని



## ఓ ఉద్యోగిని కథ!

అర్ధాకలి తోడ భోజనము చేసెనే
జానెడు పొట్టకై "బాక్సు"లో మరికొంత -
ఉద్యోగ ప్రహసనము ఉదయాన మొదలాయె;
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

బస్టాండులోన బస్సేమో రాదాయె;
నిలచినా మగువకు తెగువ రాలేదా?
ఝాన్సీరాణి వలె ఛేదించి జొరబడెనే!
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

దేశ జనాభా దరిదాపు బస్సులో
"రోమియో"ల సంబడము రెట్టింపు ప్రతిదినము -
జేబుదొంగలకేమో జీవనాధారము.
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

ఆదరా బాదరా చేరెనే ఆఫీసు
చిర్రుబుర్రుల 'బాస్' - 'వార్నింగ్' మొదలాయె
కన్నీటి ముత్యాలు జలజలరాలెనే
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

అచ్చుతప్పులు లేక టైపు చేయుట నిత్యము
అరగంటలోన మోపెడు కాగితములు
"ట్రాన్సఫర్" గొడవతో "టెన్షన్" మొదలాయె
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

గలగల మాట్లాడ "రూటు"లో వచ్చెనంటు;
ఫైల్" ఇచ్చినంతనే కన్నుగీటే క్లర్కు
పోకిరీ వెధవల పోరు చెప్పనలవికాదు
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున

సంధ్య వేళాయెనే 'సంధ్య' రాలేదనుచు,
అత్తమామలు నూరారు కారాలు, మిరియాలు -
"ఆర్టీసీ" బస్సు వేళకురాదాయె!
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

అచ్చట్లు, ముచ్చట్లు కనుచూపు మేరాయె
కడుపునిండా తిండి కరువాయెనేదేమో!
పగవారికైనా రారాదు ఈ పాట్లు ఎన్నడును
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

తీరిక లేదాయె పసివాడి పాఠాలకు
పాప కేరింతలను నోచుకోలేదాయె.
పిల్లల భవిష్యత్తు మదిలోన మెదిలెనే
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

ఆదివారము నాడు విశ్రాంతి అని తలచె
బంధుమిత్రులరాక - బలవంతపు చిరునవ్వు
బాధ్యతల నడుమ - నారినలిగెనే నేడు
ఇక్కట్ల పంథాలో అతివ అడుగడుగున!

ఆటు పోట్లకు ఇంతి ఇసుమంతచెదరక
వేచి చూచెనె వేయి కళ్లతో వేతనము కొరకై
విసిగి వేసారిన మనస్సుకు ఊరడింపుకలిగెనే
ఇక్కట్ల పంథాలోనూ అతివకు ఆనందమున!!

- కడియాల మృణాళిని

పలకరిస్తూ బోసి నవ్వులతో మురిపిస్తోంది. జయంతి మైమరచి ముద్దుల వర్షం కురిపించి హృదయానికి హత్తుకుంటే, ఆ వెచ్చదనానికీ, లాలనకు, పులకరించి పాపాయి కేరింతలు ఆడుతోంది. ఆ దృశ్యం వాసం తికి ఏదోలా అనిపించింది.

జయంతి ఎంత హాయిగా పాపను లాలిస్తోంది! తను ఒక్కరోజయినా తన ఆలనా, పాలనా ఇంతగా పాపాయికి అందివ్వగలిగిందా? అయితే, మాతృత్వపు మాధుర్యం పూర్తిగా చవిచూడలేక పోతోందా తను!

"ఏఁవిటీ! అలా చూస్తున్నారు? మీ పాపాయి, నేనూ ఎంత దోస్తీ అయి పోయామనా!" అంది. వాసంతి మౌనంగా పాపను అందుకోబోయింది. జయం తికి దూరం కావటం ఇష్టం లేనట్టుగా పాపమరింతగా పెనవేసుకు పోయింది.

"చూడండి? పాప నా దగ్గరకు 'రాను' అంటూంది. వాసంతి మాటలో ఆవేదన ధ్వనించింది.

"దానికేముందీ, మీ పనిపిల్ల సముదాయించలేక పోతే నేను చేరిక చేశాను. ఇప్పుడు నా దగ్గర బాగా అలవాటయింది... మీ పాపకి. మీ చేతు ల్లోకి రానంటోంది అంతే." ఆ మాటలు జయంతి తేలికగానే అన్నా, వాసంతి లోని మాతృహృదయం కలుక్కుమంది. పాపాయిని తీసుకొని ఇంటికి వచ్చే సరికి మదన్ అప్పుడే తను చేసిన ఉప్మా ప్లేట్లల్లో సర్దుతున్నాడు.

"అరె! మీరు టిఫెన్ తయారు చేశారా!" పాపని ఉయ్యాలలో పడుకో బెడుతూ అంది.

"అవును - వసూ! ఈ రోజు నువ్వు అలసిపోయావని నేనే చేశాను. రోజూ ఏవేళకైనా పనులన్నీ నువ్వే చేసుకుంటున్నావుగా" సర్దిచెప్పేడు. టిఫెన్ చేస్తున్నదేకానీ, వాసంతి మనసు మనసులో లేదు. తను శ్రీవారిని సరిగా సుఖపెట్టలేక పోతోంది. కన్నబిడ్డని అప్యాయత, అనురాగాలతో పెంచలేక పోతోంది. జయంతి అన్నది నిజమే. స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటానికి ముఖ్యమైంది అవసరం; కానీ - అర్హత కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప, భర్త జీతం ఎక్కువే. ఆ జీతం తను సరిగా వినియోగించగలిగితే అంతకన్నా ఉన్నతమైన ఉద్యోగం ఏముంది? వాసంతి మంచం మీద పడుకున్నా ఇవే ఆలోచనలు ఆమె మనసులో ముసురుకొంటున్నాయి. ఒక్కసారిగా ఉయ్యా లలో పాప ఏడవటంతో లేచివెళ్ళి, తీసి ప్రక్కలో వేసుకుంది. తల్లి చేరువ లోని వెచ్చదనానికే నేమో మరి పాపాయి ఏడ్పు మానేసింది. మళ్ళీ వెచ్చ దనం తనకు దూరమైపోతుంది అనుకుందేమో; అమ్మను తన చిట్టి చేతుల్తో గట్టిగా పట్టేసుకుంది. వాసంతి ఒక నిర్ణయానికి వచ్చేసింది. "వీల్లేదు. తను ఇక ఉద్యోగం చేయకూడదు. అవసరం లేకపోయినా అర్హత వుందని తనబోటి స్త్రీలు ఉద్యోగాలకు ఎగబడి, నిరుద్యోగుల జాబితాను పెంచేస్తున్నారు. తను ఇంటి పట్టున వుండి, ఇల్లు దిద్దుకుంటే చాలదూ. తను ఇన్నాళ్ళుగా ఈ విషయాన్ని గ్రహించలేకపోవటం పొరపాటే.

మరునాటి ఉదయం మౌనంగా భర్తకు తన రాజీనామా కాగితం చూపిం చింది. "ఇదేమిటి వసూ, నీకు నా మీద కోపం రాలేదుకదా!" వాసంతి అతని మాటకు చిరునవ్వు నవ్వేసింది. "భలే వారేనండి.... నేను ఈ నిర్ణయం తీసుకోవటం కోపంతో కాదు. ఇంటిని సరిదిద్దుకొని, ఇల్లాలుగా చక్కని జీవితం గడపాలనిపించింది" అంది.

"కంగ్రాట్యులేషన్స్ వసూ; ఇక గృహలక్ష్మివై ఈ రాజ్యాన్ని పరిపాలిం చటంలో కృతార్థురాలివి కావాలి," అన్నాడు నాటకీయంగా.

ఆ మధ్యాహ్నం తీరుబడిగా జయంతి దగ్గరకు వెళ్ళింది. "ఈ రోజు ఆఫీసు లేదా." జయంతి మాటకు వాసంతి ఇచ్చిన బదులు జయంతిని ఆశ్చర్యపరచింది. నాకు చాలా సంతోషంగా వుంది మీరు ఈ నిర్ణయం తీసుకోవటం. ఇక గృహజీవన సౌభాగ్యానికి చక్కని సోపానాలు వేయండి. మీకు నా అభినందనలు," వాసంతితో కరచాలనం చేస్తూ అంది.